క్లుప్తంగా

వర్మీకంపోస్టు విక్రయ కేంద్రం పరిశీలన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్మీకంపోస్టు విక్రయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సోమవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం ద్వారా తయారుచేసిన వర్మి కంపోస్టును విక్రయకేంద్రంలో ఉంచారు. ఈ కేంద్రం ద్వారా కిలో వర్మి కంపోస్ట్ ప్యాకెట్ రూ.20కు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అరకిలో, కిలో, రెండు కిలోల ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మొక్కల పెరుగుదలకు వర్మీకంపోస్టు ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లాలో ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.


చట్టాలకు విరుద్ధంగా రాష్ట్ర క్రీడాపాలసీ

విజయవాడస్పోర్ట్స్: కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్రీడా పాలసీ, క్రీడాకారులకు వెన్నుపోటు పొడిచేలా ఉందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇది క్రీడా చట్టాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఒలింపిక్స్ క్రీడలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ..సంప్రదాయ క్రీడలకు ఈ పాలసీ అన్యాయం చేస్తోందన్నారు. హర్యానా రాష్ట్ర క్రీడా పాలసీని కాపీ కొట్టారని ఆరోపించారు. అనుభవం లేని అధికారులచే రాష్ట్ర క్రీడా పాలసీని తయారు చేయించారని ఎద్దేవా చేశారు. దేశీయ సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా, బాల్‌బ్యాడ్మింటన్, మల్కాంబ్ తదితర క్రీడలకు ఈ పాలసీ అన్యాయం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడా పాలసీ ప్రకారం రాష్ట్రంలో చెస్ క్రీడలకు ఎలాంటి ప్రాధాన్యం లేదని, సీఎం చంద్రబాబు మనుమడు దేవాన్ష్ తాజాగా ఈ క్రీడలోనే ప్రపంచ రికార్డు నెలకొల్పాడని, ఇప్పుడు అతన్ని ఆంధ్రాకు బదులుగా తెలంగాణ రాష్ట్రం తరఫున ఆడించాలని వారి కుటుంబసభ్యులకు సూచించారు. గత ప్రభుత్వం ఒలింపిక్ క్రీడలతోపాటు, దేశీయ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. స్పోర్ట్స్ కోటా ద్వారా 1,500 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని, రూ.12 కోట్లను నగదు ప్రోత్సాహాలుగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడాపాలసీ క్రీడాకారుల నడ్డివిరిచేలా ఉందని ఆయన విమర్శించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సంజా ఉత్సవ్ 2024

పటమట(విజయవాడతూర్పు): పొదుపు సంఘాల సభ్యులకు నిర్వహించబోతున్న సంజా ఉత్సవ మేళాను జయప్రదం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పట్టణ సాధికార విభాగం అధికారులను ఆదేశించారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (యూసీడీ) విభాగం సిబ్బందితో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు నగరంలోని మేరీస్ స్టెల్లా కాలేజ్ ఆడిటోరియంలో విజయవాడ నగరపాలక సంస్థ, మెప్మా సంయుక్తంగా నిర్వహిస్తున్న సంజా ఉత్సవ 2024 ను అంగరంగ వైభవంగా నిర్వహించాలని సూచించారు. పొదుపు సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శించడమే కాకుండా విక్రయిస్తారని పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి లోపం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రదర్శనకు అన్ని వయస్సుల వారు వచ్చేలా ఆకర్షణీయంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

కళారంగానికి ప్రోత్సాహం



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, కళారంగాలకు లయన్సక్లబ్ పెద్దపీట వేస్తోందని, కళాకారులను సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రోత్సహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ పనిచేస్తోందన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా కళా కారుల కోసం కృషి చేస్తున్న జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు సేవలను అభినందించారు. జిల్లా గవర్నర్ శేషగిరిరావు మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వివరించారు. లయన్స్‌క్లబ్ విజయవాడ శాఖ అధ్యక్షుడు, కార్యదర్శులు రామకృష్ణ, రవీంద్రకుమార్, టీవీ గుప్తా, కేవీ శివప్రసాద్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. లయన్స్ గవర్నర్ గద్దె శేషగిరిరావును వేముల హజరత్తయ్యగుప్తా సత్కరించారు.

వైభవంగా భవానీ దీక్ష మహోత్సవాలు..



భవానీ దీక్ష విరమణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భవానీలు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. గిరి ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పద్మావతి, సీతమ్మ వారి పాదాలు, భవానీ, పున్నమి ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. భవానీలు ఇరుముడులను సమర్పించే కౌంటర్లు, హోమగుండాలు, అన్నదానం, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అర్జున వీధిలో భక్తుల రద్దీ



హోమగుండం వద్ద నేతి కొబ్బరికాయలు వేస్తున్న భవానీ భక్తులు



ఇరుముడి సమర్పిస్తున్న భవానీలు



పద్మావతి ఘాట్ వద్ద జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

ప్రజా ఫిర్యాదులపై దృష్టి సారించాలి. : డీసీపీ



విజయవాడస్పోర్ట్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పోలీస్ ప్రజావాణి) కార్యక్రమంలో ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులపై దృష్టి సారించి, నిర్ణీత కాలవ్యవధిలో ఆయా ఫిర్యాదులను పరిష్కరించాలని డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ)ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి కమిషనరేట్ పరిధిలోని సీఐలను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని 80మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలపై 33మంది, కుటుంబకలహాలపై ఆరుగురు, మహిళా సంబంధిత నేరాలపై ఒకరు, ఆస్తి వివాదాలపై 20మంది, మోసాలపై ముగ్గురు, దొంగతనాలపై ఇద్దరు, చిన్నచిన్న వివాదాలపై 15మంది ఫిర్యాదులు అందజేసినట్లు వివరించారు.

యూనివర్సిటీ జట్టుకు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: నూజివీడులో ఇటీవల జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల నెట్‌బాల్ పోటీల్లో శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు సత్తా చాటి రన్నర్‌గా నిలిచింది. జాతీయ విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్శిటీ జట్టులో కాలేజీ విద్యార్థినులు సిహెచ్.శ్రీజ, వి.రష్మిత, బి.నవ్య, జి.ధనశ్రీ చోటు దక్కించుకున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన తెలిపారు. క్రీడాకారులను ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.మాధవి, పీడీ డాక్టర్ ఎస్.హేమ, కోచ్ పి.భాస్కరరావు తదితరులు అభినందించారు.

చంద్రబాబు నాయకత్వంలో అసమర్థ పాలన



సెమీ క్రిస్మస్ వేడుకల్లో వెలంపల్లి, రాయన భాగ్యలక్ష్మీ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అత్యంత అసమర్థ పరిపాలన కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పశ్చిమ పార్టీ కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఇతర నాయకులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎన్‌వీవీ ప్రసాద్, సిస్టర్ గోనుగుంట్ల సరళ, నన్నం దుర్గ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తుంగలో తొక్కిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలపై అనేక భారాలు వేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచబోనని చెప్పి, నేడు చార్జీలు పెంచి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. షేక్ హయత్, మనోజ్, విశ్వనాథ రవి, మస్తాన్, విజయలక్ష్మి, బంకా చాము, కామళ్ల జోజి, వరకాల జోషి, మద్దిరాల కమలాకర్, నాగళ్ల సంగీత బాబు, కొరగంజి భాను, మజ్జి శ్రీనివాసరావు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి కంప్యూటర్ కోర్సుల నూతన బ్యాచ్‌లకు శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు):ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 30వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సులలో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్, అడ్వాన్స్ డీటీపీ విత్ కోరల్‌డ్రా, సీ లాంగ్వేజ్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గత 9 సంవత్సరాలుగా అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నాణ్యమైన కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు గవర్నర్‌పేటలో రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో గానీ, 90145 41958, 94900 98042 నంబర్లలో గానీ సంప్రదించి బ్యాచ్ టైమింగ్స్, ఇతర వివరాలు తెలుసుకోవాలని కోరారు.

హెల్మెట్ ధరించకుంటే చర్యలు తప్పవు

ఏసీపీ రామచంద్రరావు



మాట్లాడుతున్న ఏసీపీ రామచంద్రరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేకుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు అన్నారు. నగరంలోని వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద వాహనదారులకు, యువతకు రోడ్డు ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపైకి ద్విచక్ర వాహనం వస్తే తప్పనిసరిగా హెల్మెట్‌తోనే రావాలని కోరారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రతలో భాగంగా రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్‌తో పాటు సిబుక్, లైసెన్స్, ఇన్సూరెన్స్ పొల్యూషన్ వాహనాల ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనదారుడు తప్పకుండా మోటార్ వెహికల్ నిబంధనలు పాటించాలని, పరిమితి వేగంతో ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే నిజమైన సంతృప్తి



సత్కారం అందుకున్న గోళ్ల బాబా విజయకుమార్, మాడుగుల వరప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):సమాజానికి సేవలందించం ద్వారా నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య తెలిపారు. సెంట్రల్ క్రిస్టియన్ యూనివర్శిటీ ఆఫ్ అమెరికా నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న గోళ్ళ బాబా విజయకుమార్, మాడుగుల వరప్రసాద్ అభినందన సభ సోమవారం కేబీఎన్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయకుమార్, వరప్రసాద్ వ్యాపార రంగంలో ఉన్నత శిఖరాలు అందుకోవడంతో పాటు విద్యారంగంలోనూ సేవ చేయడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. తమ విద్యాసంస్థల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నం రామకృష్ణరావు, కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు చిట్టూరి హైస్కూల్ అధ్యక్షుడు చిట్టూరి ఆనంద్, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి అమర్ సుధీర్, ఎంఎస్ఆర్ స్కూల్ కార్యదర్శి గోనుగుంట్ల రామారావు, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

● సర్వాంగ సుందరంగా చర్చిలు





వన్‌టౌన్‌లో సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చికి విద్యుద్దీపాలతో అలంకరణ... (ఇన్‌సెట్) విద్యుత్‌కాంతులతో భవానీపురం జోజినగర్ చర్చి

భవానీపురంలోని ఓ చర్చిలో చిన్నారుల వేషధారణ



క్రీస్తు జయంతి ఉత్సవాలకు వెస్ట్ పరిధిలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ఆయా ప్రాంతాల్లో కొలువుదీరిన పురాతన చర్చిలతో పాటు నూతనంగా నిర్మించిన చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రి సమయంలో చర్చిలు మిరుమిట్లు గొలిపే లైటింగ్‌లతో అందంగా దర్శనమిస్తున్నాయి. భవానీపురంలోని ఓ చర్చిలో చిన్నారులు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే విధంగా ఉన్న వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ముగిసిన సైన్స్ ఎక్స్‌పో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు రోడ్డులోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న సైన్స్ ఎక్స్‌పో సోమవారంతో ముగిసింది. ఎక్స్‌పోలో 477వర్కింగ్ మోడల్స్, 211 డిస్‌ప్లేలను ఉంచగా, నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 3684 మంది విద్యార్థులు సందర్శించారు. సైన్స్ ఎక్స్‌పో ముగింపు సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వై పార్థసారధి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించేందుకు సైన్స్‌ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఎక్స్‌పోలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 74మందికి ప్రథమ, 74మందికి ద్వితీయ, 74మందికి తృతీయ బహుమతులను అందజేశారు. ముగ్గురు విద్యార్థులు బెస్ట్ ఎగ్జిబిట్ అవార్డులు గెలుచుకున్నారు. ప్రతి సబ్జెక్ట్ కేటగిరీలో 7గురు బడ్డింగ్ ఐకాన్ మెగా బహుమతులు గెలుచుకున్నారు. ముగింపు కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.రాజేంద్ర, ఎం.లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ప్రవీణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీ విజేత కేబీఎన్ కళాశాల



కేబీఎన్ కళాశాల జట్టుకు బహుమతిని అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జె.నాగేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్ బాల్ (పురుషులు) టోర్నమెంట్ పోటీల్లో కేబీఎన్ కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్, ఆంధ్ర లయోలా కళాశాల జట్లు వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యాన సోమవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్‌బాల్ (పురుషులు) టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జె.నాగేశ్వరరావు ప్రారంభించారు. అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం బాస్కెట్‌లో బాల్‌వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. మొదటి నాకౌట్ మ్యాచ్‌లో ఆంధ్ర లయోలా కళాశాల జట్టు 12–7 స్కోర్‌తో డాక్టర్ ఎల్.హెచ్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(మైలవరం) పై విజయం సాధించింది. రెండోనాకౌట్ మ్యాచ్‌లో కేబీఎన్ కళాశాల 15–2 స్కోర్‌తో పి.బి.ఎస్ కాలేజీపై గెలిచింది.లీగ్ మ్యాచ్‌లలో ఆంధ్ర లయోలా కళాశాల 9–8 స్కోర్‌తో ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కళాశాలపై, కేబీఎన్ కళాశాల 12–3 స్కోర్‌తో నూజివీడు ప్రభుత్వ కళాశాలపై గెలిచాయి. డీఏఆర్ కళాశాలపై ఎస్.ఆర్.ఆర్ కళాశాల 5–3 స్కోర్‌తో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కేబీఎన్ కళాశాల 10–7 స్కోర్‌తో ఆంధ్ర లయోలా కళాశాలపై గెలిచింది. చివరి మ్యాచ్‌లో ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై కేబీఎన్ కళాశాల జట్టు 10–3 స్కోరుతో విజయం సాధించి విజేతగా నిలిచింది. నాలుగో స్థానంలో నూజివీడు డీఏఆర్ కళాశాల జట్టు నిలిచింది. విజేతలకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జె.నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు మేజర్ మన్నేయ స్వామి, శశాంక్, డాక్టర్ డి.యుగంధర్, డాక్టర్ కె.రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన



ఫల, పుష్ప ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు పరిశీలిస్తున్న యువతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు):పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఫల, పుష్ప ప్రదర్శన నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పూల మొక్కలను మహిళలు, యువత ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పూణే, బెంగళూరు, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి ప్రాంతాల నుంచి నర్సరీల నిర్వాహకులు ఈ ప్రదర్శనలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇంటి ప్రాంగణంలో పెంచే మొక్కలతో పాటు, ఇంటి లోపల, టెర్రస్‌లపై పెంచేందుకు అనువుగా ఉండే మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి.

నేడు అక్కినేని విగ్రహావిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఉదయం పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ అక్కినేని విగ్రహాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దే రామ్మోహన్‌రావు, యలమంచిలి సుజనాచౌదరి, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ, అంతర్జాతీయ తొలి మహిళా శిల్పి డీ దేవికారాణి శిల్పి వుడయార్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అక్కినేని అభిమానులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

కోడి పందేల శిబిరంపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పోలవరం కాల్వ వద్ద కోడి పందేల శిబిరంపై కొత్తపేట పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలవరం కాల్వ వద్ద కొంతమంది కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సీఐ కొండలరావు తన సిబ్బందితో దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ. 19 వేలు స్వాధీనం చేసుకున్నారు. కోడి పందేల శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.